# 8

# రాకన్ మానవు హానివృద్ధులు

[మద్రాసులో వాల్‌టాక్స్‌రోడ్డు దగ్గర ఒక సందులో మా బాబాయి కాపురం వుండేవారు.

సెంట్రల్‌స్టేషన్, జనరల్ ఆస్పత్రి, మూర్ మార్కెట్టు, చైనా బజార్, జార్జిటవును, బీచి—వంటి చోట్లన్నిటికీ మధ్యగా వుండే వాళ్ళ ఇంట్లో ఎప్పుడు చూచినా ఒక బంధువో, మిత్రుడో అతిథి దేవుడిగా దర్శన మిస్తుండే వారు. ఈ కథలో మరొకలా వున్నా—మా బాబాయి, పిన్ని మాత్రం ఈ అతిథులందరినీ చిరునవ్వుతో భరిస్తుండే వాళ్ళు.

చిన్ననాటి ఈ నిజాన్ని కాస్త మార్చి ఈ 'లైటర్ వెయిన్' కథగా రూపొందించాను. ఈ కథలోని రంగనాథం జన్మభూమి కథకుడి మనసే.

పోతే—నగరాలలో కాపురంవుండేవాళ్ళకు ఈ కథలోని సమస్య పరిచితమేననుకుంటాను.]

రామానుజంగారు ఆఖరి దమ్ము లాగి సిగరెట్టు ఆష్-ట్రేలో పడేశారు.

"అంచేత......మనం ఈ విషయం గురించి కాస్త తీవ్రంగా ఆలోచిస్తే బాగుండును—" అంది తులశమ్మ, బియ్యం చేట ప్రక్కకు పెట్టి, కళ్ళజోడును తీస్తూ.

"అవును, ఆలోచించవలసిందే. గత మార్చికి వెయ్యిన్నీ రెండువందలున్న అప్పు కాస్తా ఈ మార్చికి రెండు వేలను సమీపించింది. దారుణం, కదూ-" అన్నారు రామానుజం.

"నాన్నగారూ, మనం గనుక తీవ్రమైన చర్యలు తీసుకోకపోతే, చాలా కష్టం!" అన్నాడు రంగనాథం, ఎల్. డి. సి.

"అవునోయ్! అవును-" అని కాస్సేపాగి అన్నారు రామానుజం.

"అసలు ఈ బాధలన్నిటికీ 'ఆరిజన్' ఏమిటంటే, తొమ్మిదేళ్ళక్రిందట ఈ ఇంట్లోకి మనం కాపురానికి రావడం-"

"ఈ ఇల్లు మరీ వాల్‌టాక్స్ రోడ్‌మీదే వుందాయె.... స్టేషన్ నుండి మన వీధి పట్టుమని నాలుగు ఫర్లాంగులుకూడా లేదేమో— రైలు దిగగానే పెట్టే పడకా తీసుకుని తిన్నగా ఇక్కడికే వచ్చేస్తారు, మనవాళ్ళందరూ—ఆ తర్వాత తిష్టవేశారంటే మూల విగ్రహాల్లా పాతుకుపోతారు-" అని తులశమ్మ అసలు విషయానికి నాంది పలికింది.

"జనరల్ ఆస్పత్రిలో జబ్బులు చూపించుకునేవాళ్ళు-మౌంట్ రోడ్‌లో ట్రాక్టర్లు కొనబోయేవాళ్ళు-కాలేజీల్లో సీటుకు ప్రయత్నించేవాళ్ళు - హాస్టలులో సీటు దొరికేదాకా ఎట్లాగో ఇక్కడే సరుకునేవాళ్ళు—ఈ మందనంతా మనం భరించవలసిందే! నాన్సెన్స్!!" అని కోప్పడ్డాడు రంగనాథం. ఉద్యోగంలో చేరి నాలుగు సంవత్సరాలయినా ఒక రిస్టు వాచి కొనుక్కోలేకపోయానే అని అతడి గోల.

"పోయిన వేసవిలో ఆ కాళహస్తి ఆయన వచ్చాడా, వాళ్ళమ్మాయితో....? మూడు నెలలు కూచుని 'ఇంటర్‌వ్యూలు' ముగించి, పెళ్ళికొడుకును సెలెక్ట్‌చేసి, ఆహ్వానాలు అచ్చువేయించి మరీ కదిలాడు—పెద్దమనిషి" అని ఘాటుగా విమర్శించింది తులశమ్మ. "పైపెచ్చు—వెళ్ళేటప్పుడు వాళ్ళమ్మాయికి చీర పెట్టలేదని గునుస్తూ వెళ్ళాడు మహానుభావుడు—"

"ఇంకా నయం. పెళ్ళికూడా ఇక్కడే చేసేస్తానన్నాడు కాదు" అని విట్టేశాడు రంగనాథం.

ఆ విట్టుకి నవ్వకుండానే—"ఆ పనీ చేసేవాడేకాని-మేడమీదికి నీళ్ళు రావనేసరికి కాస్త జంకాడు—" అంది తులశమ్మ.

ప్రతిపక్ష సభ్యులు పేట్రేగి పోయినప్పుడు ప్రధాన మంత్రిలా పలికారు రామానుజం— "గోపాలం ఏం తక్కువ తిన్నాడు! జూన్‌లో పదివేల రూపాయలతో వచ్చాడు కావలినుండి. ఏదో జర్మన్ కెమేరాలు కొనుక్కెళ్ళి ఫోటో స్టుడియో పెడతానన్నాడు. కెమేరాలు రావడానికి ఇంకో రెండు నెలలు పడుతుందని దుకాణం వాడన్నాడట. ఆ మాటవిని కావలికి వెళ్ళిపోయి మళ్ళీ రావచ్చునా- ఊహూ. నాలుగు నెలలా ఇరవైరెండు రోజులు తుమ్మ జిగురులా శః అడ్రసుకు అతుక్కుపోయాడు. రెండువందలా నలభై యెనిమిది పూటలు భోజనం చేశాడు కాని, ఒకపూటన్నా పది పైసలుపెట్టి తోటకూర కాడ తెచ్చిన పాపాన పోలేదు! పైగా హోటళ్ళలోవుండి డబ్బూ, ఆరోగ్యమూ తగలేసుకోవడమంత మహాపాపం లేదని నాకు లెక్చరూ!"

"గోపాలందంతా అదోక తరహాలెండి—ఒకచోట తిన్నా ఇంకోచోట పెడతాడు—"

"ఏవిటి, పంగనామాలా—? ఆ మాటకొస్తే ఆ కాళహస్తి సుబ్బయ్యే మేలు. పెళ్ళిలో మన కో రెండువందల బట్టలన్నా పెట్టాడు" అన్నారు రామానుజం.

"సుబ్బయ్య మీ బాబాయిగనుక వెనకేసుకొస్తున్నారు" అని ఆరోపించింది తులశమ్మ.

"గోపాలం మీ మామయ్యగా, అందుకనే నువ్వూ...." అని రామానుజంగారంటుండగానే స్పీకర్ రంగనాథం అడ్డు తగిలాడు- "ఇదుగో....మళ్ళీ అసలు విషయం విడిచి వ్యక్తిగత దూషణలలోకి

దిగుతున్నారు. బంధువు లనే రాబందుల మూలంగా ఇల్లు గుల్ల అయిపోవడమేకాక, మనమధ్య పొరపొచ్చాలు రావడం దారుణం-''

''ఏమిటి ఈ తరంవాళ్ళు! తరతరాల బాంధవ్యాన్ని తన్ని వేస్తానంటారే—'' అన్నట్లు చూశారు రామానుజంగారూ, తులశమ్మా.

రంగనాథం కొంచెం ధోరణిమార్చి, ''అంచేత, నాన్నగారూ! మనం ఇకముందు వీళ్ళందరితో కొంచెం స్పష్టంగా మాట్లాడ్డం నేర్చుకోవాలి-'' అన్నాడు.

అది సరిగ్గా వినకుండానే రామానుజం పలికారు: ''ఇదుగో- ఇది మార్చినెల కదూ. ఇంక వచ్చేనెలనుండి వేసవిసెలవులుకదూ. మన ఇల్లు సత్రంలా తయారవుతుంది. మెరీనాబీచి అని కొందరు, ఎయిరోడ్రమ్ అని కొందరు, మహాబలిపురం అని కొందరు-మొత్తం మీద ఇటు గుంతకల్లునుండి అటు విజయవాడవాకాగల మన బంధువు లలో నూటికి ఇరవై మంది ఇక్కడికి వేంచేస్తారు. గత జూన్ నెలతో ఆఖరయిన సెలవుల్లో మనింట్లో బైఠాయించిన బంధు వుల సంఖ్య ముప్ఫైఆరని తెలుస్తున్నది'' అని ప్రకటించారు లోక్‌సభలో డిప్యూటీ మంత్రివలె.

''అందులో సుబ్బయ్యకూడా వున్నాడా?'' అని ప్రశ్నించింది ప్రతిపక్ష సభ్యురాలు తులశమ్మ.

''అబ్బే, ఇది కేవలం సెలవులకొచ్చి వెళ్ళే గుంపు. గోపా లం సుబ్బయ్యలాటి వి. ఐ. పీ. ల నివాసం దీర్ఘకాలికం కనుక వాళ్ళం దరూ ప్రత్యేక తరగతిలోకి వస్తారు. అనెక్షర్ 'ఏ'లో వాళ్ళ పేర్లు చూడవచ్చు'' అని నవ్వారు రామానుజం.

''అటువంటి వి. ఐ. పీ. లు ఎంతమంది?'' అని సప్లిమెంటరీ వేశాడు రంగనాథం.

''నలుగురు!''

"కనుక మన కుటుంబంలో సభ్యులు ముగ్గురే అయినా మనింట్లో ప్రతిరోజూ సగటున నలుగురు భోంచేస్తున్నారన్న మాట" అని పత్రికా సంపాదకీయం లాగున 'ముగింపు' కొచ్చాడు రంగ నాథం.

కొంతసేపుగా నోరు విప్పని తులశమ్మ ఆ పని చేసింది; బ్రహ్మాండమయిన అయిడియాని కక్కింది—"ఏమండీ! అసలు వేసవి సెలవులకు మనం ఇక్కడవుంటే కదా, వీళ్ళందరూ వచ్చి మన్నెత్తిన దిగబడేది! అసలు మనమే ఆ సెలవుల్లో ఎక్కడికన్నా వెళ్ళిపోతే—?...."

ఇదేదో గళ్ళ నుడికట్టులాగా అనిపించింది రామానుజంగారికి.

"బ్రిల్లియంట్ అమ్మా! అమోఘం! ఎక్సలెంట్!" అని చప్పట్లు కొట్టాడు రంగనాథం.

"చిన్నచిన్న వూళ్ళల్లోని వారు పట్నాలలో ఏదయినా చూడ డానికి, కొనడానికి వస్తారుగాని—మద్రాసులోవున్న మనం ఎక్క డికి పోవడం?" అని సంశయించారు, అట్లాటి పని చెయ్యవచ్చు ననే ఊహ ఇంతవరకూ రాని రామానుజం.

"పెద్ద నగరాలలో వుండేవాళ్ళు 'హాలీ డే' కని పల్లెలకు పోయే ఆచారం పడమటిదేశాల్లో వుంది—" అని అమ్మను సమర్థిం చాడు రంగనాథం.

"కాళహస్తి, కావలి-అన్నీ చూచిరావచ్చు-" అంది తన అయిడియాని మానసికంగా పొడిగించుతున్న తులశమ్మ.

"అవును, పాయింటే! అట్లాగే వాడి కేదన్నా సంబంధాలు చూడవచ్చు-" అన్నాడు రామానుజం.

"ఆ కాళహస్తి సుబ్బయ్యా ఇంట్లోనే పెళ్ళి జరిపితే సరి. ఆయన ఋణం తీరిపోతుంది-" అన్నాడు రవ్వంతయినా సిగ్గుపడని పెళ్ళికొడుకు.

రామానుజం నవ్వారు. "అక్కడినుండి నువ్వూ. పెళ్ళి కూతురూ కావలి వెళ్ళి గోపాలంచేత ఫోటోలు తీయించుకోవచ్చు. ఉచితంగా!"

నాన్నా. కొడుకూ నవ్వారు.

తులశమ్మ ఇంకా ఆలోచిస్తూ మాట్లాడింది. "కావలిదాకా వెళ్ళితే బందరెంత? ఇంకో వందో. వందా యాభై మైళ్ళో! మా అమ్మమ్మకు తొంభై రెండేళ్ళయింది. ఆవిడను చూచిరావాలి....బ్రతికి వున్నాళ్ళ బ్రతక దావిడ—"

"వెళదాం నాన్నా! విజయవాడలో నా క్లాస్‌మేట్ పద్మనాభ రావునీ చూడవచ్చు-" అన్నాడు రంగనాథం.

"మరి నీకు సెలవు దొరుకుతుందిరా?"

"ఈ నాలుగేళ్ళల్లోనూ నేను 'ప్రివిలేజ్ లీవ్' తీసుకోనే లేదుగా" అన్నాడు రంగనాథం.

"అయితే సరే. మాబడి ఏప్రిలు తొమ్మిదిన మూస్తారు-" అన్నారు టీచరు రామానుజం.

"పదవతేదీనాడు తిథీ నక్షత్రమూ బాగున్నాయేమో చూడండీ- అబ్బాయి. పూజగదిలోనుంచి పంచాంగం తీసుకురా" అంది తుల శమ్మ........

....ఏప్రిలు పధ్నాలుగున మద్రాసు వదిలారు రామానుజం. సకుటుంబంగా. కాళహస్తి. తిరుపతి. కావలి. విజయవాడ. బందరు తిరిగి జూన్ ఇరవైన హడావిడిగా మద్రాసు చేరారు.

జులై మొదటివారందాకా వెనక్కు రాకపోయేవారేగాని. వాళ్ళు బందరులో దిగిన నాల్గవరోజున మద్రాసులో వాళ్ళింటి క్రింది వాటా వెంకట్రామన్‌నుండి టెలిగ్రాం వచ్చింది.

"ఇంట్లో—క్రిందా—పైనా—దొంగలు—నిన్న రాత్రి—ఏం పోయాయో—వస్తువులు— రండి —తక్షణం—రామనాథన్ వెంకట్రామన్—"

వచ్చారు తక్షణం, గుండెలు బాదుకుంటూ.

అన్ని నగలనూ, చాలావరకు బట్టలనూ తమతో ఊరికి తీసుకెళ్ళారు గనుక ఎక్కువ 'చాయిస్' లేకపోయింది తస్కరులకు. వెండివి రెండు గిన్నెలు, పూజ పళ్ళెం—నాలుగు బెడ్‌షీట్లు, కొన్ని స్టెయిన్‌లెస్‌స్టీలు సామాన్లు తీసుకెళ్ళారు వాళ్ళు. అంటే సుమారు ఆరువందల రూపాయలు నష్టపోయారు రామానుజంగారు.

అటు బంధువులకు చీరలనీ ధోవతులనీ కొనడం, ఇటు రైలు ఛార్జీలూ కలిపి మూడువందలా అరవై అయింది.

"వెరసి 1963-64 వేసవిలో ఖర్చు వెయ్యి రూపాయలు" అని సమీక్షించారు రామానుజం, జూన్‌లో ఆఖరి ఆదివారంనాడు మళ్ళీ కుటుంబం తీరికగా సమావేశమయినపుడు.

"1962-63 వేసవిలో ఖర్చెంత నాన్నా?"

"మనకు ప్రతినెలా అయ్యే రెండువందలూకాక ఇంకో ఎనభై చొప్పున ఎక్కువ అయింది—ఏప్రిల్, మే, జూన్ నెలలలో. అంటే మొత్తం ఎనిమిది వందలా నలభై అయిందన్నమాట పోయినసారి."

"అంటే, ఈసారి వందా ఇరవై రూపాయలు ఎక్కువ ఖర్చయింది."

మరే-అసలు ఇల్లు విడిచి వెళ్ళకుండావుంటే ఈ దొంగలు - పోలీసులు-స్టేట్‌మెంట్లు—ఏ గొడవా వుండేదికాదు" అన్నారు రామానుజం, తులశమ్మ వైపు చూస్తూ.

"ఆ వెధవ చచ్చిన దొంగలు పడకపోతే ఆరు వందలు కలిసొచ్చేవిగా—" అంది తులశమ్మ అక్కడనుండి లేచి వెళ్తూ.

రామానుజం నవ్వారు.

రంగనాధం మెదడులో అత్యద్భుతమైన మెరుపు మెరిసింది.

"మరి నాన్నగారూ! బస్సుకూ, రైలుకూ, ఆస్పత్రికీ, బీచికీ దగ్గరగా కాపురం వుంటేకదా ఈ బంధువుల బెడద! మనం ఏ సెంట్‌థామస్ మవుంట్లోనో వాటా తీసుకుంటే-"

మూడు నిముషాలు మాట్లాడలేదు రామానుజంగారు. ఆ తర్వాత తులశమ్మను పిలిచారు—ఈ క్రొత్త ప్రతిపాదనను చర్చించడానికి!